4/12/26, 3:42 PM IMG_4019.JPG



# అంతరంగం

ఆచార్య మాదిరాజు రంగారావు ప్రముఖ కవి, విమర్శకులు, కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేసిన మాదిరాజు వచన కవిత్వంపై విశేషమైన కృషి చేశారు. వచన కవిత్వాన్ని స్వేచ్ఛా కవిత్వంగా పిలుస్తూ, చర్చకి అవకాశం కల్పిస్తూ యు.జి.సి. వారి ఫెలోషిప్‌తో స్వేచ్ఛా కవిత్వంపై విస్తృతమైన పరిశోధన చేస్తున్నారు. ఇప్పటికి దాదాపు ఏభై గ్రంథాలు ప్రచురించిన ఈ సాహితీ తపనుడితో కాసేపు:

**వచన కవిత్వాన్ని మీరు స్వేచ్ఛా కవిత్వం అని ఎందుకంటున్నారు? ఈ పేరు ప్రాచుర్యం పొందలేదు కదా?**

తనదైన విధంగా అంటే కవి వ్యక్తిత్వాన్ని బట్టి, స్థితి ననుసరించి ఏ నియమ నిబంధనల ప్రమేయం లేకుండా రాసేది స్వాచ్ఛా కవిత్వ (స్వ+ఇచ్ఛా) దీనికి పరంపరాగతమైన, నిర్దిష్టమైన నమూనా కాని, ఛందస్సు కాని లేదు. కవి ఆలోచన, అభిప్రాయం, సందర్భం అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు అంతర్గతమైన అభివ్యక్తి ప్రత్యేకతలతో ఆవిష్కృతమవుతుంది. దీన్ని నిర్మాణ స్వేచ్ఛ అనవచ్చు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ కీలకమైన అంశాల్లో ముఖ్యమైంది. సాహిత్య చరిత్రలో స్వాతంత్ర్యానంతర కాలాన్ని 'స్వేచ్ఛా యుగం' అనడం సమంజసం. స్వేచ్ఛా కవిత్వంలో ఈ స్వేచ్ఛ సంపూర్ణంగా ప్రతిబింబిస్తుంది. స్వేచ్ఛా కవిత్వం ఆధునికతకు సాధనంగా పరిణమించింది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ కారణంగా తెలుగు కవిత్వంలో ఎన్నో సిద్ధాంతాలకూ, దృక్పథాలకూ, అభిప్రాయాలకూ అవకాశం హెచ్చింది. వైవిధ్యం చేకూరింది. ఈనాడు మార్పుకు సంబంధించిన అంశాలు మునుముందుగా అనుభూతి గాఢత్వం, అభివ్యక్తి నైశిత్యం, లేదా విశిష్టలతో నిర్మాణ సౌలభ్యం ఉన్న స్వేచ్ఛా కవిత్వంలోనే ఆవిష్కృతమవుతున్నాయి. దీనికి మూలం స్వేచ్ఛను కోరే మనోరూపమే.

రెండవ అంశం – ఈ పేరు ప్రాచుర్యం గురించి. ప్రాచుర్యం పొందకపోవడం అనేది ఒక పేరు అవసరాన్ని సామంజస్యాన్ని, శక్తినీ తక్కువ చేయదు. దీనిపై సహేతుకమైన చర్చ జరగవలసి ఉంది. కవిత్వానికి అవసరమైన వచనేతర శక్తిని భాసింపజేసేది 'స్వేచ్ఛా కవిత్వం'. ఇది క్రమంగా వచన కవిత్వం స్థానంలో విస్తృతమైన ప్రయోజన గుణం చేత స్వీకరింపబడుతుందనే నా అభిప్రాయం.

**వచన కవిత్వం, స్వేచ్ఛా కవిత్వం రెండూ ఒకటి కాదా?**

రెండూ ఒకటి కాదు. వచన కవిత్వం అనేమాట పరిమితమైన పరిధి కలిగింది. స్వేచ్ఛా కవిత్వమన్నమాట "ప్రజాస్వామ్య భావనా కేంద్రంగా బహు విస్తృతమైన అవకాశం

https://drive.google.com/drive/folders/1g0t2aDQ03_FeMRx07NjDyEz38loIMRvv 1/1

4/12/26, 3:43 PM IMG_4018.JPG



కలిగింది. 'వచన'మన్న మాట సంకుచితమైన అర్థాన్ని, 'స్వేచ్ఛ' అనే మాట విశాలమైన భావాన్నీ స్ఫురింపజేస్తాయి. ఇకపోతే వచన కవిత్వమన్న మాట నిస్సారంగా పేలవంగా ఉంది. కవిత్వం ససారమైంది. శక్తి సంభృతమైంది. వచనమన్న మాట కవిత్వానికి అవసరమైన గాఢత్వానికీ సీరియస్‌నెస్‌కూ దూరంగా ఉంది. విరోధాభాసను తలపిస్తోంది. వచన అన్న మాటలో ఔచిత్యం లేదు. అందువల్ల 'స్వేచ్ఛ' అన్నమాటను చేర్చడం సముచితం. వచనంలోను కవిత్వం ఉండవచ్చునన్న వాదం ఈ సందర్భంలో సరియైనది కాదు. ఒక్కమాటలో చెబితే సమాజంలో ప్రజాస్వామ్య వ్యవస్థ వల్ల సిద్ధించిన స్వేచ్ఛావకాశాన్ని స్వేచ్ఛా కవిత్వమన్నమాట సంపూర్ణంగా బింబిస్తుంది.

**కవికి కమిట్‌మెంట్ ఉండాలా? మీరు దేనికి కమిటెడ్?**

కమిట్‌మెంట్ ఉంటే ఒక విశ్వాసానికీ, అభిప్రాయానికీ, సిద్ధాంతానికీ, చర్యకూ కట్టుబడి ఉండడమన్న మాట. అయితే ప్రతి కవికీ నిబద్ధత ఉంటుంది. దేనిపై? అన్నది వేరే విషయం. నా విషయానికి వస్తే నేను ప్రజాస్వామ్యానికి నిబద్ధుణ్ణి. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మొదలైనవి ప్రజాస్వామ్యంలో శాంతియుతమైన పాత్రను నిర్వహించేది స్పష్టం. సాహిత్యంలో కమిట్‌మెంట్ రెండు విధాలుగా ఉంది.

1. బహిరాశ్రమమైంది. కవి దృష్టిలో వ్యవహార ప్రపంచానికీ భౌతికావసరాలకూ సంబంధించింది.

2. అంతరాశ్రమమైంది. కవి రచనలో జీవిత దర్శనానికీ వ్యక్తిలో ఉన్నతమయిన విలువలకూ సంబంధించింది. రెండింటికీ ట్రాన్స్‌ఫరెన్సీ ఉంటుంది. ఇవి రచనలో భిన్న భిన్న నిష్పత్తుల్లో సమకూరుతాయి. ఈ నిష్పత్తుల్లో ఏర్పడిన సమాహార రూపం కమిట్‌మెంట్ విధానాన్ని భావింపజేస్తుంది. నిబద్ధత ఎంత గాఢంగా తీవ్రంగా ఉంటే రచన అంత ప్రత్యేకతను పొందుతుంది. సృజనశక్తి చేత నిబద్ధత కంట్రోల్ చేయబడాలి. అప్పుడే సాహిత్యపరమైన విలువలు సమకూరుతాయి.

**ఇప్పటివరకూ మీరు నలభై కవితా సంపుటాలు, ఏడు విమర్శ గ్రంథాలు ప్రచురించారు. సాహిత్యంలో మీ కృషికి తగిన గుర్తింపు వచ్చిందంటారా? అవార్డులపై మీ అభిప్రాయం?**

'గుర్తింపు' అంటే స్వేచ్ఛా కవిత్వంలో ప్రత్యేకతను గురించి ఆలోచన మునుముందు తప్పకుండా జరుగుతుందనే నా నమ్మకం. ఒక తరం తరువాత వచ్చే తరాలు వస్తుపరంగానే దృష్టిని కేంద్రీకరించడం మన అనుభవంలో ఉన్నదే.

ఇక ప్రచారమనేది అవసరమే. ప్రచారమంటే నా దృష్టిలో పదిమందికీ తెలియడం అనేది. ఇది ఎన్నో అంశాలపై ఆధారపడింది. ఒకరి విషయంలో ఒక సందర్భంలో పనిచేసినవి, మరొకరి విషయంలో మరో సందర్భంలో పనిచేయకపోవచ్చు. దీనికి

https://drive.google.com/drive/folders/1g0t2aDQ03_FeMRx07NjDyEz38loIMRvv 1/1

4/12/26, 3:43 PM IMG_4017.JPG



వ్యవహారశైలి (అంటే ఉన్న పరిస్థితుల్ని ఉపయోగించుకోవడం, అనుకూల పరిస్థితుల్ని సృష్టించుకోవడం, అవసరాన్ని బట్టి ధనవినిమయం) సమూహ సంఘటన శక్తీ, ప్రచార సాధనాలపై పట్టు, ఇలా ఎన్నో పనిచేయడం జరుగుతుంది. వీటిని నిర్వహించే కళ కూడా అవసరం.

అవార్డు వస్తే మంచిదే. రాకపోయినంత మాత్రాన సాహిత్య వ్యక్తిత్వానికి తరుగు లేదు. ఏ సమయంలోనైనా ఒక్కరికే అవార్డు వస్తుంది. పదిమంది ఆశిస్తారు. అవార్డు ఒక రచయితకు వచ్చాక అభినందించడం చాలా అవసరం. ఎందుకంటే అవార్డు వచ్చాక రచయిత సాహిత్యాన్ని గౌరవించడమన్న మాటే. ఇది మంచి సాహిత్య సంస్కృతికి దారితీస్తుంది.

**నేటి విమర్శ ఎలా ఉంది? కమిటెడ్ విమర్శ లాభమేనా?**

కవీ విమర్శకుడూ వేరు కాదు. కవి అంతరంగ దర్శకుడు, విమర్శకుడు. కాబట్టి విమర్శకునిలో దర్శనశక్తి లేదా కాంతి ఏ అల్పమైన వాటిచేతనూ కప్పబడిపోకూడదు. నేటి సమాజంలోని సామాజిక రాజకీయ స్థితి బింబమే విమర్శలోనూ కనిపిస్తుంది. తెలుగు సాహిత్య విమర్శలో స్ట్రాటజిక్ విమర్శకులూ, ఫ్రాక్షనల్ విమర్శకులూ ఎక్కువయ్యారు. అధ్యయన సమన్వయ విమర్శకులు తక్కువ. దర్శన విమర్శకులు మరీ తక్కువ. స్ట్రాటజిక్ (విమర్శ, ఫ్రాక్షనల్ విమర్శ రెండూ ఒకే నాణెం రెండు వైపులుగా పనిచేస్తున్నాయి.

కమిటెడ్ అంటే నిబద్ధత – అనుకుంటే ఒక సిద్ధాంతం, అభిప్రాయం, దృక్పథంపై కట్టుబడిన వెలుగులో రచనను దర్శించడంలో తప్పులేదు. కానీ ఇది కిటికీలు, తలుపులూ మూసిన స్థితి కారాదు. నిబద్ధత వల్ల పరిశీలనలో కొత్త విషయాలపై సూక్ష్మాంశాలపై దృష్టిపడే అవకాశం ఉంది.

**ఇటీవల ప్రాంతీయత సాహిత్యంలో చోటు చేసుకుంటోంది గదా! ఇది వైవిధ్యానికి సంకేతమా? ప్రాంతీయాభిమానాలకా?**

ప్రాంతీయత అనివార్యం. కొన్ని హద్దుల్లో అభిలషణీయమే కూడా. కొన్ని సమయాల్లో, సందర్భాల్లో సామాజిక రాజకీయ కారణాల వల్ల విపరీత స్థితుల్ని పొందుతుంది. ఆయా సందర్భాల్లో సాహిత్యంలో (దేశి మొదలుగా) ఉద్భవించి తెలుగు సాహిత్యానికి వైవిధ్యాన్ని చేకూర్చాయి కూడా. ప్రాంతీయాభిమానం ఇప్పటిది కాదు. ఎప్పటిదో! ఎప్పటికీ ఉండేదే. కాస్త ఉదారత, సమానత, సమన్వయభావంతో సాహిత్యంలో ప్రాంతీయ దురభిమానాన్ని జయించవచ్చు. తెలుగు భాషా సాహిత్యాల్ని ఖండఖండంగా కాక సంపూర్ణంగా దర్శించడంలోనే ఆనందం ఉంది. ఉపయోగ విస్తృతి ఉంది.

https://drive.google.com/drive/folders/1g0t2aDQ03_FeMRx07NjDyEz38loIMRvv 1/1

4/12/26, 3:43 PM IMG_4016.JPG



**హైకూ కవిత్వంపై మీ అభిప్రాయం?**

హైకూ కవిత్వంలో ఒక విశిష్టమైన కవితాబింబం, మూలం ఎక్కడిదైనా సంక్షిప్తత, గుప్తతతో పాటు జీవితమూ ప్రకృతీ తాత్త్వికం భూమికలతో ఆకర్షణీయమైన సంగ్రహ కళారూపం. ఇది తెలుగు కవిత్వానికి శోభనిస్తుంది.

**ఇటీవలి కవితావాదాలపై మీ స్పందన?**

ఈ వాదాలన్నీ కవిత్వంలో చారిత్రక నేపథ్యంలో సామాజికావసరాల్ని బట్టి అవతరిస్తాయి. అయితే వీటిలో సృజనశక్తి ఉంటే ప్రయోజన గుణంలో ఔన్నత్యం ఉంటే నిలుస్తాయి. వీటిని దేనికది ప్రత్యేకంగా సమాలోచన జరపాలి తప్ప, ఒకే త్రాటిపై చేర్చి చూడకూడదు.

**తెలుగులో పరిశోధన ఎలా సాగుతోందంటారు?**

తెలుగులో పరిశోధన బేసిక్ విషయాలపై కాక ప్రత్యేకాంశాలపై జరగవలసి ఉంది. పూర్వం ఒక విషయంపై సాధారణ స్థాయిలో మెటీరియల్ దొరికేది కాదు. ఇప్పుడు ఎంతో లభిస్తోంది. అభిలాషతోనైతేనేం, డిగ్రీ కోసమైతేనేం, పదోన్నతి కోసమైతేనేం విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనల్లో కాలం పరీక్షకు నిలిచినవీ ఉన్నాయి.

ఇప్పుడు జరుగుతున్న పరిశోధనలో సమాజమూ ఇతర క్షేత్రాలలో లాగానే 'మంచి నిర్దేశకత్వం', 'విలువలూ', 'అభిలాష' మాత్రమే కాక, నిబద్ధత 'తత్పరత' అవసరం. ఇది మంచి పరిశోధనా సంస్కృతికి దారి తీస్తుంది.

ఇంటర్వ్యూ : డాక్టర్ ద్వా. నా. శాస్త్రి

(ఆంధ్రప్రభ - ఆదివారం, 21-అక్టోబర్, 2001)

https://drive.google.com/drive/folders/1g0t2aDQ03_FeMRx07NjDyEz38loIMRvv 1/1